

# అమృత వర్షం !

మధ్యాహ్నం ఒంటిగంటయింది !

పోస్టాఫీసు తలుపులు మూసి, తాళం వేసి అరుగు మెట్లు దిగాడు రాజారావు. ఆకాశం వైపు చూశాడు. అంతా మబ్బు మబ్బుగా ఉంది. చిన్న చిన్న చినుకులు పడటం తప్ప వర్ష ఋతువు ప్రవేశించి వారం రోజులయినా ఒక రోజూ సెంటీ మీటరు వాన కురవలేదు.

"ఏమిటో, ఋతువులూ గతి తప్పిపోతున్నాయి !" అనుకోకుండా ఉండలేకపోయాడు రాజారావు.

ఆలోచనగా వీధిలో నడుస్తున్నాడు. దూరంగా వీధి చివర రామనాధం గారింటి ముందు ఏడుపులు, పెడబొబ్బలు వినబడుతున్నాయి. రామనాధంగారిని నిన్నటి ఉదయం ఎనిమిది గంటలకే ఇరుగు పొరుగు వాళ్ళంతా కలిసి బయట పెట్టేశారు.

వాన రాకడ, ప్రాణం పోకడ ఎప్పుడో ఎవరికీ తెలియదట !

'రామనాధం గారి ప్రాణం మాత్రం కొన్ని గంటల్లో అనంతవాయువుల్లో కలిసిపోతుందని ఊరి వైద్యుడు శంకరాచారి ఖచ్చితంగా శెలవిచ్చాడు. అయన మాటకు తిరుగులేదు. శంకరాచారి ఈ ఊరికి ఏకైక వైద్యుడు. అల్లోపతి, ఆయుర్వేదం, హోమియోపతి కలగలిపి వైద్యం చేస్తాడాయన. శంకరాచారి హస్తవాసి మీద ఊరి ప్రజలకు గురి ఎక్కువే !

ఈపాటికి రామనాధంగారి భౌతికకాయాన్ని 'జీవుడు' విడిచిపెట్టే ఉండాలి. అందువల్లనే ఏడుపులు, పెడబొబ్బలు అంత పెద్దపెట్టున వినబడు

తున్నాయి.

పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పల్లెటూర్లో రాజారావు చిన్న పోస్టుమాస్టరు అతనితో బాటు పనిచేసే పోస్ట్‌మన్ హుస్సేన్ ఉత్తరాల మీద ముద్రలు కొట్టడం, బట్వాడా చేయడం, తపాలా సంచులు మూటలు కట్టడంలాంటి అన్ని పనులూ చేస్తూంటాడు.

రాజారావు ఈ పల్లెటూరికి బదిలీ అయి ఒక సంవత్సరమైంది. పోస్టాఫీసు, ఇల్లూ ఒకటే! నాలుగు గదుల పెంకుటిల్లు. పెద్ద పెరడు ఉంది ఇద్దరు పిల్లలతో ఈ ఊళ్లో జీవనం ప్రశాంతంగానే గడిచిపోతున్నది.

రాజారావు వీధిలో అడుగులు వేస్తూ ముందుకు నడుస్తున్నాడు. అతని కళ్లల్లో రామనాధం గారు కదులుతున్నారు. ఈ సంవత్సరకాలంగా రామనాధంగారు రాజారావుకు ఒకరకంగా ఆత్మీయుడయ్యాడు. ఆయనిప్పుడు కాలం చేశాడంటే ఏధో వెలితిగా ఉంది. గుండె నెవరో నొక్కి పెడుతూన్నంత బాధగా ఉంది.

నిన్న ఉదయమే రామనాధం కొడుకులకీ, కూతుర్లకీ రాజారావే స్వయంగా టెలిగ్రాములిచ్చాడు. రామనాధం గారి పరిస్థితి బాగులేదని కాదు, ఆయన ఈ లోకం విడిచిపెట్టి వెళ్ళిపోయారనే ఆ టెలిగ్రాముల సారాంశం !

"పరిస్థితి బాగులేదంటే ఎవరు వస్తారో, ఎవరు రాకుండా ఉండిపోతారో ! ఆయన పోయారనే ఇవ్వు, నాయనా !" అంటూ భోరుమని ఏడుస్తూ చెప్పింది రామనాధంగారి భార్య మహదేవమ్మ.

రామనాధంగారికి డెబ్భై ఏళ్ళు పైనే ఉంటాయి. 'జీవితంలో ఎప్పుడూ ఒక జలుబు కాని, జ్వరంకానీ ఎరగను' అంటూ గర్వంగా చెప్పుకునే వాడాయన. ఆరోగ్యంగానే ఎప్పుడూ కనిపించేవాడు. ఏదో ఒక నెపంతో వీధిలో అటూ ఇటూ తిరిగేవాడు. ఆయన తరచూ పోస్టాఫీసుకు వచ్చేవాడు. బల్లమీద కూర్చునేవాడు. కొడుకులకీ, కూతుర్లకీ ఉత్తరాలు రాసేవాడు. మనియార్డరు గురించి వాకబు చేసేవాడు. రాజారావుతో సొదగా కబుర్లు చెప్పేవాడు. బరువుగా నిట్టూర్పులు విడిచేవాడు.

"పూర్వం, పల్లెటూర్లకీ, ఇప్పటికీ అసలు పోలికలే లేవు. మనుషులూ మారిపోయారు. అంతా వ్యాపారమే కదటోయ్ ! శుభ్రమైన పాలు దొరకటం లేదు, తాజా కూరగాయలు మనకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. అన్నీ పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. డబ్బు గడించడమే ప్రధాన వ్యాపకంగా పెట్టుకుంటున్నారు. అంతేకాదు, మనుషులు కూడా వ్యాపారాలకు ముడి సరుకులుగా మారిపోతున్నారు. అయినవాళ్ల మధ్య కూడా ఈ వ్యాపార దృష్టి అనివార్యమయిపోతోంది !" అంటూ కూరగాయల ధరలు మొదలు పెట్టి, పిల్లల మనస్తత్వాలు విశ్లేషించి, ఊళ్ళో కొట్లాటలు కుమ్ములాటల వరకు ప్రస్తావించి, ప్రశ్నించి, రాజారావు అభిప్రాయం వెలిబుచ్చే వరకూ ఊరుకునేవాడు కాదు !

రాజారావు మాట్లాడకపోయినా, తీరిక లేక పనిలో మునిగిపోయి ఉన్నా, ఆయన ధోరణిలో మార్పు ఉండేది కాదు !

అలాంటి మనిషి మంచాన పడిపోయాడు. మళ్ళీ లేవలేదు. ఒకటి రెండు సార్లు ఇంటికి వెళ్లి చూసి వచ్చాడు రాజారావు !

రామనాధం గారికి నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు. మొత్తం ఏడుగురు సంతానం! కొడుకులు నలుగురూ, ఒకడు వరంగల్లులో, రెండోవాడు రాజమండ్రిలో, మూడోవాడు మచిలీపట్టణంలో, నాలుగోవాడు నంద్యాలలో ప్రభుత్వ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అందరికీ పెళ్ళిళ్ళయ్యాయి. మనవలూ మనవరాళ్ళూ కలిగారు. వాళ్ళూ పెరిగి పెద్దవాళ్లవుతున్నారు. ముగ్గురు కూతుళ్ళకీ మంచి సంబంధాలే చేశాడు. అల్లుళ్ళు మంచి హోదాలో ఉన్నవాళ్లే! రామనాధం గారు తన పిల్లల గురించి మాత్రం ఎన్నడూ తక్కువగా మాట్లాడేవారు కాదు.

ఎప్పుడైనా కూతురు దగ్గర్నుంచి ఒక ఉత్తరం కానీ, కొడుకు నుంచి ఒక మనియార్డరు కానీ వస్తే ఆయన ఆనందానికి పట్టపగ్గాలు ఉండేవి కావు. ముఖం ఇంత చేసుకునేవాడు ! ముసిముసిగా నవ్వుకునేవాడు ! గాల్లో తేలిపోతున్నట్టుగా గబగబా నడిచి వెళ్లిపోయేవాడు.

వీధి చివరకు నడిచి వచ్చాడు రాజారావు. రామనాధం గారింటి ముందు భారంగా నిలబడ్డాడు.

చాపమీద రామనాధంగారు గాఢంగా నిద్రపోతున్నట్లుగా ఉన్నారు. చావు కళ ఆయన ముఖంలో ఏ కోశానా లేదు. పైన చినుకులు పడకుండా, ఎండ పొడ వాలకుండా రెండు దుప్పట్లు కలిపి పందిరిలా కట్టారు. ఆయన మీద పడి భార్య మహదేవమ్మగారు గొల్లుమని ఏడుస్తోంది. చుట్టుపక్కల జనం దడికట్టినట్లుగా చుట్టూ నిలబడి సానుభూతి కురిపిస్తున్నారు. 'నిన్నటి ఉదయం నుంచీ రామనాధంగారు' అలా వీధిలోనే పడి ఉన్నారు.

రాజారావు అక్కడ నిలబడి ఉండగానే ఊరి వైద్యుడు శంకరాచారి వచ్చాడు. రామనాధంగారి నాడి పట్టుకుని చూశాడు. "జీవుడు ఉన్నట్టుగానూ ఉన్నాడు. లేనట్టుగానూ ఉన్నాడు. ఏమైనా గట్టి పిండమే !" అటూ ఏదీ తేల్చి చెప్పకుండానే వెళ్లిపోయాడు.

రాజారావు ఇచ్చిన టెలిగ్రాములు అందాయేమో అప్పటికి ఇద్దరు కొడుకులు కోడళ్లు, వాళ్ళ పిల్లలూ, ఒక కూతురూ - అల్లుడూ వచ్చి మహదేవమ్మగారిని పట్టుకుని గోలగా విలపిస్తున్నారు. ఇంకా ఇద్దరు కొడుకులూ, ఇద్దరు కూతుళ్ళూ రావలసి ఉంది.

మహాదేవమ్మగారు పెద్ద గొంతుతో ఏడుస్తోంది. ఆయన్ని తట్టి లేపుతోంది. చెవి దగ్గర నోరు పెట్టి పిలుస్తోంది.

"ఏవండీ ! చిన్నాడు రామం వచ్చాడు లేవండీ! మీ ముద్దుల కొడుకు భాస్కరం వచ్చాడు, కోడళ్లు వచ్చారు. మనవలూ, మనవరాళ్లూ వచ్చారు. ఆఖరు పిల్ల అరుణ వచ్చింది. అల్లుడుగారొచ్చారు. ఒక్కసారి కళ్లు తెరవండీ ! పిల్లల్ని చూడండీ ! ఏవండీ !"

రాజారావును ఆ దృశ్యం కదిలించింది. మనసు వింత భావ సంచలనంతో విలవిలలాడింది. భారమైన హృదయంతో కొంతసేపు అలాగే నిలబడి, తిరిగి పోస్టాఫీసు తెరిచే టైము కావడంతో వెనక్కి మళ్లాడు.

..... ..... .....

సాయంత్రం ఆరుగంటలయింది.

అరుగు మీద నిలబడ్డాడు రాజారావు. ఆకాశంలో మబ్బులు లేవు. అంతా నిర్మలంగా ఉంది. ఈ రోజు కూడా వర్షం ఒక్క చినుకూ పడలేదు. వీధి చివరగా ఏడుపులు వినబడటం లేదు.

రామనాధం గారి అంతిమ యాత్ర పూర్తయిందేమో ! ఆయన కొడుకులూ, కూతుళ్ళూ, అల్లుళ్ళూ అందరూ వచ్చేశారేమో !

రామనాధంగారింకా ఈ వీధిలో నడుస్తున్నట్లుగానే ఉంది. అతని కళ్లముందు అరుగుమీద బల్లపైన కూర్చుని ఆయన కబుర్లు చెబుతూన్నట్లుగానే ఉంది. "కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం - రెప్పపాటు కాలం ఈ జీవితం !" మహాకవి వాక్కులు మనసులో మెదులుతున్నాయి. విషాద మేఘం ఏదో మనసు నావరించి వైరాగ్యరాగం ఆలపిస్తోంది.

అల్లంత దూరంలో పోస్టుమన్ హుస్సేన్ పరుగులాంటి నడకతో వస్తూ కనిపించాడు. అతని నడకలో తేడా ఏదో స్పష్టంగా కనపడుతోంది.

'ఏమిటోయ్, అంత హడావుడిగా వస్తున్నావ్?' దగ్గరకు రాగానే అడిగాడు రాజారావు.

"మీకీ విషయం తెలిసిందా సార్ ?" అతను ఆయాసపడుతున్నట్టుగా అన్నాడు.

"నువ్వు చెప్పందే నాకెలా తెలుస్తుందోయ్ చెప్పు ..."

"రామనాధంగారు...."

"ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయారు. అంత్యక్రియలు జరుగుతున్నాయి. నువ్వు వెళ్లివచ్చావ్, నన్నూ వెళ్లమంటావు. అంతేగా !"

"అదికాదు, సార్ ! రామనాధంగారు చనిపోలేదు. లేచి కూర్చున్నారు !"

అదిరిపడినట్లుగా ఒక్క ఉరుకులో అరుగు దిగాడు రాజారావు.

"నీకు మతిగాని పోయిందా ? ఏమిటి నువ్వు మాట్లాడుతోంది ?"

"నిజమే సార్ ! మీరు వెళ్లి చూడండి !"

ఒక విసురుతో హుస్సేన్‌ని తప్పించుకుని గబగబా వీధిలో ముందుకు నడిచాడు రాజారావు.

రామనాధంగారు లేచి కూర్చోవడమేమిటి ? మరణించాడనుకున్న ఆయన మళ్ళీ బ్రతకడమేమిటి? ఏమిటీ మాయ ? ఏమిటీ మంత్రం ? ఎలా

జరిగిందిది ? మధ్యాహ్నమే కదూ ఆయన్ని తను వెళ్లి చూసి వచ్చింది ? ఆశలన్నీ వదులుకుని నిన్న ఉదయమే బయట పెట్టేశారు కదూ రామనాధం గారిని ! మళ్లీ ఆయన ఎలా బతికాడు ?

ఆలోచించలేకపోతున్నాడు రాజారావు.

అయిదే అయిదు నిముషాల్లో రామనాధం గారింటి ముందు వాలిపోయాడు.

రామనాధంగారు వీధిలో లేరు. ఇంటి వసారాలో మంచం మీద దిండు నానుకుని గోడకు చేరగిలపడి కూర్చున్నాడు. ఆయన మంచం చుట్టూ బంధు వర్గం - కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు అందరూ గుమిగూడిట్లుగా ఉత్సాహంగా కబుర్లు చెబుతున్నారు. రామనాధంగారు మనిషి చాలా బలహీనంగా కనపబడుతున్నా, గొంతు బలంగానే వినబడుతోంది.

రాజారావుకు నోట మాట రాలేదు. శిలలా ఒక మూల నిలబడిపోయాడు.

"రండి, మాస్టారూ ! అక్కడే నిలబడిపోయారేం?" రామనాధంగారు రాజారావుని చూసి హీన స్వరంతో పలకరించారు.

"మీరు మీరేనా ? నాకు నమ్మకం కలగడం లేదు !" ఎలాగో గొంతు విప్పాడు.

"నమ్మలేకపోవడానికి ఏముంది, మాస్టారూ ! నాకు కాలం చెల్లిందని బయట పెట్టేశారట ! అనారోగ్యంతో మంచాన పడ్డాను. నిజమే ! ఎన్ని రోజులు అలా పడి ఉన్నానో నాకు తెలియదు. కానీ, నావాళ్ళు అనుకున్న వాళ్లందరూ నా కోసం వచ్చారు. నా ముందు ఉన్నారన్న నా భార్య పిలుపు, ఏడుపు ఏవో లోకాల్లోకి వెళ్లిపోతున్న, నన్ను వెనక్కి రప్పించాయి. నాకు మెలకువ తెప్పించాయి. నాకు జీవశక్తి నిచ్చాయి. నన్ను మళ్ళీ బతికించాయి. నా పిల్లలందరినీ చూసి ఎన్నాళ్లయిందో ఎన్నేళ్లు అయిందో! మీకు తెలియదా, మాస్టారూ ! నేను కోరుకునేది ఈ వృద్ధాప్యంలో నా ఆరాటం, ఆనందం, తపన, తాపత్రయం అంతా నా పిల్లలు నా కళ్లముందు ఉండాలనేగా ! కూర్చోండి, మాస్టారూ!"

రామనాధంగారు అమృతం తాగిన మనిషిలా ఆనందంగా వెలిగిపోతున్నారు.

"నేను మళ్లీ వస్తానండీ !" రాజారావు వెనక్కి మళ్ళాడు. వీధిలో నడుస్తున్నాడు.

అయినవాళ్ళ అనుబంధాలు, ఆత్మీయతలు మనిషికి పునర్జన్మనిస్తాయా ? జీవశక్తిని ప్రాణప్రతిష్ట చేస్తాయా ? మృత్యుముఖంలో ఉన్న జీవికి అమృత తత్వాన్ని ఆపాదిస్తాయా ?

రామనాధంగారు ఎప్పుడూ పోస్టాఫీసు చుట్టూ ఏదో పోగొట్టుకున్నవాడిలా తిరుగుతుంటాడు. ఎక్కడెక్కడో దూరంగా ఉన్న కొడుకులకీ, కూతుళ్ళకీ పదే పదే ఉత్తరాలు రాస్తూంటాడు. వాళ్ల జవాబుల కోసం రాత్రింబవళ్ళూ పలవరిస్తూంటాడు. కలవరిస్తూంటాడు. ఒక్కళ్ళూ జవాబు రాయరు. ఒకపూట వచ్చి ఈ ముసలివాళ్ళతో గడపరు. ఈయన ఈ ఊరు వదిలి వెళ్లడు, వాళ్ళు రారు !

మనిషికి అన్నపానీయా లెంత అవసరమో అభిమానాలూ, అనుబంధాలూ, ఆత్మీయతలూ అంతే అవసరం అన్నది ఎంత తియ్యటి వాస్తవం ?

కానీ నేటి నాగరిక యాంత్రిక జీవనం పరుగుల్లో స్వార్థపు తాపత్రయాల్లో ఎవరికి వారే, అయినవాళ్ల మధ్య గడపకుండా ఈ అనుబంధాల్ని ఆత్మీ యతల్ని అలక్ష్యం చేస్తున్నవాళ్లే, కుటుంబ సంబంధాల్ని తేలికగా వదులుకుంటున్నవాళ్లే.

రాజారావులో ఏదో ఉద్వేగం... ఉత్సాహం, కొత్త ఊపిరి... నాలుగడుగులు వేశాడో, లేదో ఉన్నట్టుండి ఊహించని విధంగా అతనిపై చిన్న చిన్న చినుకులు ! ఆ చినుకులు పెద్దవై క్షణాల్లో పెద్ద వర్షం !

అవును, ఇది మామూలు వర్షం కాదు... అమృత వర్షం !

అభిమానాలు, ఆత్మీయతలూ, అనుబంధాలు అమృతవర్షంలాంటివే ! అవి మనుషుల్ని బతికిస్తాయి...

ఈ అమృత వర్షంలోనే తడిసి రామనాధంగారు మళ్లీ పునరుజ్జీవుడయ్యాడు !

నెల రోజులు సెలవు పెట్టి ఎక్కడో దూరంగా ఉన్న తన తల్లిదండ్రులతో గడపాలన్న నిర్ణయంతో రాజారావు కూడా ఆ వర్షంలో నిలువునా తడిసిపోయాడు !

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక

8-3-1995